# నమస్తే తెలంగాణ

## యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, మంగళవారం 5 నవంబర్ 2024 YADADRI BHUVANAGIRI


## పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ మున్నాళ్ల ముచ్చటేనా!




ఆత్మకూరు(ఎం), నవంబర్ 4 : కేసుల తీవ్రత పెరుగడంతో మండల పోలీస్ స్టేషన్‌ను రాచకొండ సీపీ ఆదేశాల మేరకు అప్‌గ్రేడ్‌గా మార్చి అక్టోబర్ 9న సీఐగా సోలోమాన్‌రాజ్‌ను నియమించారు. 22రోజుల పాటు విధులు నిర్వహించిన సీఐ.. 3 రోజుల క్రితం బదిలీ అయ్యారు. దీంతో మండలానికి సీఐ పోస్ట్ రద్దయినట్లు సమాచారం. సీఐ స్థాయి పోలీస్ స్టేషన్‌లో 60 మంది సిబ్బంది అవసరం కాగా ఆత్మకూరు(ఎం)లో కేవలం 30 మంది మాత్రమే ఉన్నారు. అదీ కాక బిల్డింగ్, సరైన సౌకర్యాలు లేకపోవడంతోనే సీఐ పోస్ట్‌ను రద్దు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సీఐగా బాధ్యతలు చేపట్టిన సోలోమాన్‌రాజ్ డ్యూటీలో చేరిన రోజు నుంచే చిరు వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఇతర వ్యాపారుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారులు బదిలీ వేటు వేసినట్లు మరి కొందరు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ మున్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయిందంటూ మండల ప్రజలు అనుకుంటున్నారు.

## యాదగిరి గుట్టలో కార్తీక దీపారాధన

- మహిళా భక్తులకు ఉచితంగా వాయినాల అందజేత : ఈఓ



యాదగిరి గుట్ట కొండపైన దీపాలు వెలిగిస్తున్న మహిళలు

యాదగిరిగుట్ట, నవంబర్ 4 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా దీపారాధన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లింగాకారం, ఓం ఆకారంతో దీపాలు వెలిగించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. సామూహిక దీపోత్సవంలో భాగంగా ఉచిత వాయినాల పంపిణీ కౌంటర్‌ను ఆలయ ఈఓ భాస్కర్‌రావు ప్రారంభించారు. కార్తీకమాసాంతం వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి కొండపై అఖండ దీరాపాధన వద్ద మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, కనుము, వక్కలు, ఖర్జూర పండ్లు, తమలపాకులు, గాజులు, లడ్డూ ప్రసాదంతో కూడిన వాయినాలను ఉచితంగా అందజేయనున్నట్లు ఈఓ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా సోమవారం సైతం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# ఇంటింటి సర్వేకు సిద్ధం



- రేపటి నుంచి ప్రారంభం.. 15రోజుల్లో పూర్తి
- జిల్లాలో 2,47,354 ఇండ్లు
- 1.938 మంది ఎన్యుమరేటర్ల నియామకం
- పీఎస్‌ల ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లతో సర్వే
- సర్వే పూర్తయిన ప్రతి ఇంటికీ స్టిక్కర్

భువనగిరి అర్బన్, నవంబర్ 4 : ఈ నెల 6 నుంచి జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించనున్నారు. జిల్లాలో 2,47,354 ఇండ్లు ఉండగా ఇండ్ల సర్వే కోసం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఇతర శాఖల సిబ్బందితో కలిపి మొత్తం 1938 మందిని నియమించారు. ప్రధాన, ఉప ప్రశ్నలతో కలిపి మొత్తంగా 75 అంశాలపై వివరాలు సేకరించనున్నారు. ఏ రోజుకారోజు మండల స్థాయిలో వివరాలను ఆన్‌లైన్ చేయనుండడంతో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారు, ఇంకా మిగిలిన అర్హుల వివరాలు లెక్క తేలుతుంది. ప్రభుత్వ పరంగా చేపట్టే కార్యక్రమాలకు ఈ సర్వే కీలకంగా మారనుంది. ఈ సర్వే మొత్తం 15 రోజులు నిర్వహించి పూర్తి చేస్తారు.

### పదేండ్ల తర్వాత ఇంటింటికీ..

2011లో జనగణన, 2014లో సమగ్ర కుటుంబ సర్వే జరుగగా మళ్లీ 10 ఏండ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టింది. జిల్లాలో ఉన్న మొత్తం ఇండ్లను 6, 7, 8వ తేదీల్లో గుర్తిస్తారు. ఆ తర్వాత 9వ తేదీ నుంచి ఎన్యుమరేటర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి సర్వే మొదలు పెడతారు. జనగణన సమయాన చేసినట్లుగా 150 ఇండ్లను ఒక ఎన్యుమరేషన్ బ్లాక్ (ఈబీ)గా తీసుకుంటారు. ఒక్కొక్కరు రోజుకు పది ఇండ్ల చొప్పున పదిహేను రోజుల్లో 150 ఇండ్ల సర్వే పూర్తి చేస్తారు. పాత జనాభా లెక్కల ప్రకారమే వీటిని పరిగణనలోకి తీసుకుంటారు. జనాభా పెరిగినందున ఎన్యుమరేషన్ బ్లాక్ లోనే 250 ఇండ్లు ఉంటే మొదటి 150 ఇండ్లకు ఒకరు, మిగతా 100 ఇండ్లకు ఇంకో ఎన్యుమరేటర్‌ను నియమించి దీనిని 100/ఏ, 100/బీగా గుర్తిస్తారు.

### ఒక్కొక్క కుటుంబానికి అరగంట..

సర్వేపై ఇటీవల పైలట్ ప్రాజెక్టు నిర్వహించారు. ప్రశ్నావళిలో 75 ప్రశ్నలు ఉండడంతో ఒక్కో ఇంట్లో సేకరించడానికి అర గంట పట్టింది. అందుకే రోజుకు పది ఇండ్ల చొప్పున 15 రోజుల్లో ఎన్యుమరేటర్ సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది. సర్వే చేసిన ప్రతి ఇంటికీ స్టిక్కర్ వేస్తారు. అలాగే, ఎన్యుమరేటర్లకు స్టేషనరీతో కూడిన బ్యాగ్ కూడా అందుబాటులో ఉంటుంది.

### ప్రాథమిక పాఠశాలల టీచర్లతో..

సర్వేకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు 1,249 మందిని ఎంపికచేశారు. మొత్తంగా ఎన్యుమరేటర్లలో వీరు 50 శాతం ఉంటారు. ఒక పూట పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనం అనంతరం సర్వేలో పాల్గొనాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్పీలు, వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల సిబ్బందితో పాటు సర్వేలో రెగ్యులర్ ఉద్యోగులనే తీసుకున్నారు. 2011 జనగణన ప్రకారం జిల్లాలో 1746 ఎన్యుమరేషన్ బ్లాక్‌లు ఉన్నాయి. ప్రస్తుత జనాభా ప్రకారం 1800 బ్లాక్‌లు వచ్చాయి.

### అభివృద్ధికి ఈ లెక్కలే ఆధారం

ప్రస్తుతం చేస్తున్న సర్వే కేవలం జనాభా లెక్కల కోసమే కాదు..ఎవరు ఎక్కడ ఉన్నారు, ఎక్కడ వెనుకబడిపోయారు అనేది తెలిస్తే ఎక్కడ అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. అభివృద్ధి పనులే కాక పథకాల అమలు ఈ లెక్కలతో సాధ్యమవుతుంది. ఈ సర్వే సమాచార సేకరణ మాత్రమే తప్ప పథకాలేవీ రద్దు కావని ప్రజలు గుర్తించాలని అధికారులు అంటున్నారు. చాలామందికి సరైన ఆధారాలు లేక ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారు. ఇప్పుడు సర్వేతో ఇది సులభమవుతుంది. సర్వే చేసే ప్రాంతాల్లో ఒక రోజు ముందుగానే సమాచారం ఇచ్చి ప్రజలు అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కల్పించడంతో నిర్దేశిత సమయంలో సర్వే పూర్తవుతుంది.

### పదిమందికి ఒక సూపర్‌వైజర్

పది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్ వైజర్ చొప్పున 194 మందిని కేటాయించారు. అదేవిధంగా జిల్లాలోని 17 మండలాలకు ప్రతి మండలానికి ఎంపీడీఓను నోడల్ అధికారులుగా, ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. జిల్లాలోని 6 మున్సిపాలిటీలకు మున్సిపల్ కమిషనర్లను నోడల్ అధికారులుగా నియమించారు.

### ఏ రోజుకారోజు ఆన్‌లైన్

సర్వే వివరాలను ఏ రోజుకారోజు మండలాల వారీగా ప్రణాళిక అధికారుల పర్యవేక్షణలో పది మంది ఆపరేటర్లతో ఆన్‌లైన్ చేస్తారు. మొత్తంగా 20రోజుల్లో డేటా ఎంట్రీ పూర్తవుతుంది. ఆ తర్వాత సమగ్ర వివరాలను ప్రభుత్వానికి పంపుతాం. ఈ సర్వే ద్వారా జిల్లాలో ఇండ్లు, జనాభా, ఇతర వివరాలన్నీ స్పష్టంగా తెలిసిపోతాయి. సర్వే అధికారులకు జిల్లా ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలి.

**- కలెక్టర్ హనుమంతరావు**



సీఎం పర్యటనపై సన్నాహక సమావేశానికి హాజరైన మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

## 8న జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

- పర్యటన ఖరారు
- కుటుంబ సమేతంగా యాదగిరిగుట్టకు రాక
- అనంతరం అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష
- గుట్టలో మిషన్ భగీరథ పైలాన్ ప్రారంభం
- మూసీ వెంట పునరుజ్జీవన యాత్ర
- ఏర్పాట్లు చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి టూర్ ఖరారైంది. ఈ నెల 8న ముఖ్యమంత్రి విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8న రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా హెలికాప్టర్ ద్వారా యాదగిరిగుట్టకు రానున్నారు. అక్కడి నుంచి కొండ చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించనున్నారు. అనంతరం కొండ పైకి వెళ్లనున్నారు. ప్రధానాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత కొండపైన ఉన్న పుష్కరిణి సందర్శించనున్నారు. అటు నుంచి ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్లనున్నారు. అక్కడే గుట్ట అభివృద్ధి పనులపై వైటీడీఏ, యాదగిరిగుట్ట, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. కాగా ఇదే ఏడాది మార్చి 1న సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొని, వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇక మిషన్ భగీరథ పథకంలో భాగంగా సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ నుంచి జిల్లాలోని యాదగిరిగుట్ట వరకు రూ. 210 కోట్లతో నిర్మించనున్న పైప్‌లైన్ ప్రాజెక్ట్ పైలాన్ ప్రారంభంతోపాటు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్ట పర్యటన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

### మూసీ వెంట యాత్ర..

జిల్లాలోని మూసీ వెంట సీఎం రేవంత్ రెడ్డి యాత్ర చేపట్టనున్నారు. మూసీ పునరుజ్జీవన ప్రజా చైతన్య యాత్ర పేరుతో కార్యక్రమం కొనసాగనుంది. భువనగిరి మండలంలోని బొల్లెపల్లి, సంగెం మధ్య భీమలింగం కత్వా వరకు యాత్ర చేపట్టనున్నారు. అనంతరం మూసీ వంతెన వద్ద రైతులు, వివిధ కుల వృత్తులతో రేవంత్ రెడ్డి మాట్లాడతారు. ఈ కార్యక్రమంపై హైదరాబాద్‌లోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నివాసంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డితోపాటు పలువురు నేతలు సమావేశమై.. వివిధ అంశాలపై చర్చించారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా పర్యటించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరుతున్నారని, అయితే ఇప్పటి వరకు దీనిపై స్పష్టత లేదని తెలుస్తున్నది. సీఎం యాత్రకు జన సమీకరణ కోసం అధికార కాంగ్రెస్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. యాత్ర అనంతరం రేవంత్ రెడ్డి.. రోడ్డు మార్గంలో హైదరాబాద్ బయల్దేరి వెళ్లనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



సంగెం గ్రామ పరిధిలోని భీమలింగం కత్వా వద్ద మూసీ నదిని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

## రైతులపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం



నార్కట్‌పల్లి కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చిరుమర్తి లింగయ్య

- ధాన్యం తెచ్చి నెల రోజులైనా కొనరా?
- అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు
- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, నవంబర్ 4 : రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తెచ్చి నెల రోజులైనా కొనుగోలు చేయరా.. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఇంత నిర్లక్ష్యమని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి అనంతరం విలేకరులతో మాట్లాడారు. మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మళ్లీ వాటి వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు తిరిగి చూడలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోళ్లు చేయలేదని, అధికారులతో సంబంధిత సమావేశాలు ఏర్పాటు చేయలేకపోయారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ చెల్లించి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరి కోతలు ప్రారంభమై నెల గడుస్తున్నా కొన్ని చోట్ల గన్నీ బ్యాగులు కూడా లేవని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్దకు సరైన సమయానికి లారీలు కూడా రావడం లేదని, అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అకాల వర్షాలతో రైతులు కంటికి నిద్ర లేకుండా కేంద్రాల వద్ద పడిగాపులుకాస్తున్నారని అన్నారు. చిన్న, పెద్ద కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించాలని, మాటలు మితిమీరవద్దని హెచ్చరించారు. రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ యానాల అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, కర్నాటి ఉపేందర్, మహేశ్వరం సతీశ్, శ్రీను, దోసపాటి విష్ణుమూర్తి, పర్రెపాటి యాదగిరి, వాజిద్, పకీర్ సత్తిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్ అయిన మాజీ సర్పంచ్‌లు

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

- జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్లకుండా అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు
- పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు పిలుపు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు రూ.120 కోట్ల పెండింగ్ బకాయిలు

నల్లగొండ, నవంబర్ 4 : పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న మాజీ సర్పంచ్‌లను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా పోలీసులు ఆయా గ్రామాలకు వెళ్లి మాజీ సర్పంచులను అరెస్ట్ చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. ఉమ్మడి జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల్లో సుమారు రూ.120కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు సర్పంచులు అంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి నెలా రూ.29 కోట్ల చొప్పున ఇవ్వడంతో పాటు పలు అబివృద్ధి పనుల కోసం నిధులు విడుదల చేసింది. ప్రధానంగా అన్ని గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు వేశారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని ఎన్నోసార్లు మాజీ సర్పంచులు సీఎం రేవంత్ దగ్గరకు వెళ్లి మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ బిల్లులు ఇవ్వకపోవడంతో సోమవారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశానుసారం అన్ని గ్రామాల్లో ఉన్న సర్పంచులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రానికి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

## ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ రమణి

భువనగిరి అర్బన్, నవంబర్ 4 : 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులకు భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ రమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో మేథోశక్తి పెరుగుతుందన్నారు. మొదటి రోజు బాలికలు, బాలురకు వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ధనంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, నాయకులు అధికం లక్ష్మీనారాయణ, కొలుపుల వివేకానంద పాల్గొన్నారు.

## గుట్టను ఆక్రమించి రోడ్డు వేశారు

### అంబుజా సిమెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



రామన్నపేటలో సబ్బంబోర్డు గుట్టను ఆక్రమించిన స్థలాన్ని పరిశీలిస్తున్న గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం నాయకులు, తదితరులు

- గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మద్దెపురం రాజు
- జీవాల మేత కోసం గతంలో గుట్టను ప్రభుత్వం కేటాయించిందని వెల్లడి

రామన్నపేట, నవంబర్ 4: రామన్నపేట నుంచి కొమ్మాయిగూడెం వరకు విస్తరించి ఉన్న సబ్బంబోర్డు గుట్టను అక్రమిస్తూ రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మించిన అంబుజా సిమెంట్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘంజిల్లా ప్రధానకార్యదర్శి మద్దెపురం రాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జీఎంపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సబ్బంబోర్డు గుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30ఏండ్ల క్రితం ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీఓ 559 ప్రకారం జీవాల మేతకోసం ఈ గుట్టను కొమ్మాయిగూడెం, రామన్నపేట గొర్రెల పెంపకందారుల సంఘాలకు కేటాయించిందని తెలిపారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు కోసం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన మండల, డివిజన్, జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులు, గుట్టను ఆనుకొని నిర్మించిన రోడ్డును చూసీచూడనట్టు వ్యవహరించారని చెప్పారు. భూమి, నీరు, విద్యుత్ మొదలైన సహజ వనరులను లూటీచేసి నిర్మించ తలపెట్టిన సిమెంట్ పరిశ్రమను ప్రజలు అడ్డుకోవాలన్నారు. పరిశ్రమ వల్ల ఏర్పడే జల, వాయు, దుమ్ముతో కూడిన గడ్డిని తినడం వల్ల గొర్రెలు, పాడిపశువులు శ్వాస, జీర్ణకోశ వ్యాధులకు గురై వృత్తిదారులు, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న సిమెంట్ పరిశ్రమకు ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కోరారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరి నగేశ్, మండల పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కో కన్వీనర్ ఎండీ రేహాన్, తిరుగుడు మల్లికార్జున్, జీఎంపీఎస్ నాయకులు నీల అయిలయ్య, కనగంటి ఐలయ్య, తీర్పాల మల్లయ్య, బంటు సత్తయ్య, రేపాక లింగస్వామి, మోటె శ్రీను, ఇస్తారి, బుర్రి శ్రీశైలం, లింగస్వామి, మహేశ్ పాల్గొన్నారు.

## 'ఉచితం'లో దెయ్యం చేపలు

- తొలిరోజు చెరువుల్లో పోసిన పిల్లల్లో డెవిల్ ఫిష్, క్యాట్ ఫిష్
- చర్లపల్లి, నర్సింగ్‌బట్లలో గుర్తించిన మత్స్యకారులు
- ఇవి మిగతా చేప పిల్లలను వెంటాడి తినేస్తాయని ఆవేదన

నల్లగొండ, నవంబర్ 4 : మత్స్యకారుల ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడాల్సిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఇప్పుడు ఉపాధిని దెబ్బతీసేలా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే చేప పిల్లల్లో డెవిల్ ఫిష్, క్యాట్ ఫిష్ ఉండడం ఆందోళనకు గురి చేస్తున్నది. నీటి వసతి లేకపోయినా వారం పాటు ఈ చేపలు చెరువుల్లో ఇతర చేప పిల్లలను తినేస్తాయని మత్స్యకారులు వాపోతున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని చర్లపల్లి భీమసముద్రంలో సోమవారం మత్స్యశాఖ యంత్రాంగం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి 3.61 లక్షల చేప పిల్లలు విడదల చేయగా, అందులో ఇతర చేప పిల్లలను వేటాడి తినే డెవిల్, క్యాట్ ఫిష్ ఉండడం మత్స్యకారులు గుర్తించారు. దాంతో తాజాగా పోసిన చేప పిల్లల సంగతి అలా ఉంచితే, ఇప్పటికే చెరువులో ఉన్న చేప పిల్లల పరిస్థితి ఏంటని తలలు పట్టుకోవాల్సి వస్తున్నది.

### ఇతర చేపలను వెంటాడి వేటాడి తినేవే డెవిల్, క్యాట్ ఫిష్..

డెవిల్ ఫిష్, క్యాట్ ఫిష్ తినడానికి పనికి రావు. ఇవి నీటి వనరుల్లోని ఇతర చేప పిల్లలను కూడా తినేస్తాయి. పెద్ద చేపలను కూడా ఇవి వేటాడుతాయని మత్స్యకారులు చెబుతున్నారు. అలాంటి ప్రమాదకరమైన డెవిల్, క్యాట్ ఫిష్ పిల్లలు ప్రభుత్వం ఉచితంగా విడుదల చేస్తున్న చేప పిల్లల్లో కలిసి వస్తున్నాయి. సోమవారం నల్లగొండ మండలంలోని మండలంలోని నర్సింగ్‌బట్ల, పాతూరు, చర్లపల్లి చెరువుల్లో మొత్తం 5.55 లక్షల చేప పిల్లలను వదలగా.. వాటిల్లో డెవిల్ ఫిష్, క్యాట్ ఫిష్ కలిస వచ్చాయి. కొందరు మత్స్యకారులకు కొన్నింటిని తీసి చంపేయగా, గుర్తించని వాళ్లు చెరువులో పోశారు. ఈ ఘటనపై చర్లపల్లిలో సొసైటీ అధ్యక్షుడిపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఘర్షణకు దిగారు.

### కైకలూరు నుంచి నల్లగొండకు..

నల్లగొండ జిల్లాలో టెండర్ వేసిన కాంట్రాక్టర్లు తమకు స్థానికంగా ఫిష్ సీడ్ ఫామ్స్ లేకపోవడంతో ఏపీలోని కైకలూరు నుంచి చేప పిల్లలను తీసుకొచ్చినట్లు మత్స్యకారులు చెబుతున్నారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన రెండో ఏడాది నుంచే ప్రభుత్వ ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను విడుదల చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో జరిగిన టెండర్ల తర్వాత జిల్లాలో ఫిష్ సీడ్ ఫామ్స్ లేవని, చిన్నవి ఉన్నా అందులో సీడ్ సరిపోనూ లేదని మత్స్యశాఖ యంత్రాంగం టెండర్లు రద్దు చేసింది. కానీ, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఫిష్ సీడ్ లేకపోయినప్పటికీ వారికే ఫైనల్ చేయడం గమనార్హం.



చర్లపల్లిలో గుర్తించి మత్స్యకారులు చంపిన డెవిల్, క్యాట్ ఫిష్

### దెయ్యం చేపలతో చాలా నష్టం



దెయ్యం(డెవిల్) చేపలు చెరువుల్లోని ఇతర చేప పిల్లలను చంపి తింటాయి. వాటి కారణంగా పోసిన చేప పిల్ల ల్లో 80 శాతం దాకా బతకడ ం కష్టమే. ఇలాంటి ప్రమాదకరమైన చేపలు తెచ్చి పోయడం మంచిది కాదు. మేము మొద ట గుర్తు పట్టలేక పోయాం. గుర్తు పట్టేలోపు అన్నీ చెరువులో పోశాం.

**-మారయ్య, మత్స్యకారుడు, చర్లపల్లి**